సాక్షి కర్నూలు

సోమవారం। 2। డిసెంబర్। 2024



పుత్తడి బొమ్మకు పుస్తెల'దండ'న

బాల్య వివాహాలు బాలికల భవితకు శాపంగా మారుతున్నాయి. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల దండ తప్పడం లేదు. బడికెళ్లాల్సిన వయస్సులో పెళ్లిపీటలెక్కుతున్నారు.

8లో



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్య కళా వేదికపై ఖమ్మం జిల్లాకు చెందిన అభినందన రుద్ర నాట్యాలయ బృందం ప్రదర్శించిన నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,629.70
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:92.994
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:2,816
అవుట్ ఫ్లో	:6,025

న్యూస్‌రీల్

శ్రీమఠంలో ప్రత్యేక పూజలు



బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం: రాఘవేంద్రస్వామి మఠం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. స్వామి వారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాలతో పాటు కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా తుంగభద్ర నదిలో పుణ్యస్నానాలు ఆచరించి గ్రామ దేవత మంచాలమ్మ, శ్రీ రాఘవేంద్రస్వామి మూలబృందావనంకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. బృందావన ప్రతిమను బంగారు పల్లకీలో ఉంచి శ్రీ మఠం మాఢ విధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను గజ,చెక్క, వెండి, బంగారు, నవరత్న రథోత్సవాల పై కొలువుంచి శ్రీ మఠం ప్రాకారంలో అశేషభక్త జన వాహిని మధ్య రథ యాత్ర సాగించారు. రథోత్సవంలో మేనేజర్ వెంకటేష్‌జోషి అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహామూర్తి, అసిస్టెంట్ పీఆర్వో వ్యాసరాజాచార్, బిందుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి



పీఆర్‌టీయూ రాష్ట్ర నేతలతో జిల్లా నూతన అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి

కర్నూలు కల్చరల్: పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎస్‌వీ కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక టౌన్ మోడల్ ప్రభుత్వ పాఠశాలలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ధనుంజయ ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ వి. కరుణానిధిమూర్తి హాజరయ్యారు. ఎన్నికల అధికారులుగా వి.కృష్ణారెడ్డి, ఎల్. నాగమల్లేశ్వర రెడ్డి వ్యవహరించారు. ఉద్యోగ ఉపాధ్యాయులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న ఆర్థిక అంశాలను క్లియర్ చేయాలని ఈ సందర్భంగా నూతన జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి డిమాండ్ చేశారు.

రేపు అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం

కర్నూలు(అర్బన్): ఈ నెల 3వ తేదీన అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల (దివ్యాంగుల) దినోత్సవ కార్యక్రమాన్ని స్థానిక కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిస్ ఫాతిమా ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా ఉదయం 10 గంటలకు స్థానిక రాజ్‌విహార్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్ నుంచి కలెక్టరేట్ వరకు దివ్యాంగుల ర్యాలీని నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన అధికారులు, విభిన్న ప్రతిభావంతులు పాల్గొనాలని ఆమె కోరారు.


నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలన్నారు. కలెక్టరేట్‌తో పాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తగ్గిన పింఛన్ల పంపిణీ శాతం

కర్నూలు (అగ్రికల్చర్): డిసెంబరు నెలకు సంబంధించి మొదటి రోజు పింఛన్ల పంపిణీ శాతం తగ్గిపోయింది. నవంబరు నెల వరకు మొదటి రోజునే 99 శాతం పింఛన్ల పంపిణీ జరిగేది. రెండో రోజు 0.30 నుంచి 0.50 శాతం వరకు జరిగేది. ఈసారి కర్నూలు జిల్లాలో తొలిరోజు 96.48 శాతం, నంద్యాల జిల్లాలో 96.23 శాతం మాత్రమే పింఛన్ల పంపిణీ జరిగింది. ప్రభుత్వం మూడు నెలల పింఛన్ల మొత్తాన్ని ఒకేసారి తీసుకునే వెసులుబాటు కల్పించడమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది. కాగా డిసెంబరు నెలకు సంబంధించి సోమవారం కూడా పింఛన్ల పంపిణీ జరుగుతుందని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల తెలిపారు.

పచ్చ కామెర్ల వాళ్లకు లోకమంతా పచ్చగా కనిపించినట్లుగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల్లో అక్రమాలు, అవినీతి చోటు చేసుకున్నాయని కూటమి నేతలు మొదటి నుంచి ఆరోపణలు చేస్తున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా విచారణలు.. కమిటీలు అంటూ హడావుడి చేశారు. గత ప్రభుత్వం అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పించగా.. కూటమి ప్రభుత్వం హోల్డ్ చేసి పేదలను భయపెట్టింది. తీరా విచారణలో అంతా సక్రమమేనని తేలడంతో సర్కారు ఆరోపణల్లో పస లేదని తేటతెల్లమవుతోంది.



అనుభవం.. సక్రమం!

- 22ఏ అసైన్‌మెంట్ భూముల ఫ్రీ హోల్డ్‌లో ఉల్లంఘనలు ల్లేవు
- నిగ్గు తేల్చేసిన తహసీల్దార్ల ఆధ్వర్యంలోని రెవెన్యూ బృందాలు
- జిల్లాలో 15,022 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేసిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అధికారంలోకి రాగానే ఆ భూములను హోల్డ్‌లో పెట్టి విచారణ చేపట్టిన కూటమి సర్కారు
- ఆరోపణలు అవాస్తవాలని విచారణ నివేదికలతో వెల్లడి



కలెక్టరేట్‌లోని కమాండ్ కంట్రోల్ రూంలో అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ రికార్డులను స్కాన్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): అసైన్‌మెంట్ భూముల ఫ్రీహోల్డ్‌పై కూటమి నేతలు, ఎల్లో మీడియా చేసినా రాద్ధాంతం అంతా ఇంతా కాదు. ఇదంతా తప్పని నిరూపితమైంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పేదల నుంచి అసైన్‌మెంట్ భూములను లాక్కొని ఇతరులకు కట్టబెట్టారనే ఆరోపణలు చేస్తూ కూటమి సర్కారు చేయించిన విచారణలో ఎలాంటి అక్రమాలు జరగలేదని అధికారులు తేల్చారు. కర్నూలు జిల్లాలో సెంటు భూమి విషయంలో కూడా అక్రమాలు చోటు చేసుకోలేదని తహసీల్దార్ల ఆధ్వర్యంలోని రెవెన్యూ బృందాల విచారణలో రుజువైంది. ఈ క్రమంలో ప్రభుత్వ ఆలోచననే అక్రమమని, అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ సక్రమేనని తేటతెల్లమైంది. ఎన్నో ఏళ్లుగా భూములు లేని పేద రైతులకు డీ- పట్టాలు, అసైన్‌మెంట్ పట్టాలు ఇవ్వడం, ఆన్‌లైన్, అడంగల్‌లో పేర్లను నమోదు చేసి సాగు చేసుకోవడానికి ప్రభుత్వాలు అనుభవం కల్పిస్తూ వచ్చాయి. అయితే వాటిపై పూర్తి స్థాయిలో హక్కులను కల్పించడం లేదు. దీంతో భూములు వారి స్వాధీనంలో ఉన్నా ఆపద సమయం, అవసరానికి వాటిని బ్యాంకుల్లో తనఖా పెట్టడం, ప్రైవేటు వ్యక్తుల వద్ద కుదువ పెట్టడం, అమ్ముకోవడానికి హక్కులు లేకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. భూములు ఉండి అనుభవంలో ఉన్నా.. హక్కులు లేకపోవడంతో ఎంతో నష్టపోయారు. ఈ క్రమంలో పలువురు తమకు హక్కులు కల్పించాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి లేఖలు రాసి విన్నవించారు. దీంతో అప్పటి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అసైన్‌మెంట్ చట్టానికి సవరణలు చేసి 2023 ఆగస్టు నాటికి 20 ఏళ్లు అనుభవం ఉన్న రైతులకు వారు సాగులో ఉన్న భూములపై సంపూర్ణ హక్కులు కల్పించింది. ఐదేళ్ల క్రితం వరకు కర్నూలు జిల్లాలోని 26 మండలాల్లో 1,954 ఎకరాల డీ -పట్టాలు, అసైన్‌మెంట్ భూములకు మాత్రమే హక్కులు ఉండేవి. మిగతా వారికి ఎలాంటి హక్కులు లేవు. కేవలం వాటిని సాగు చేసుకోవడానికి మాత్రమే అవకాశం ఉండేది. ఈ క్రమంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 20 ఏళ్ల అనుభవం ఉన్న రైతుల భూములను ఫ్రీహోల్డ్ చేసి 15,022 ఎకరాలపై హక్కులు కల్పించారు. ఇందులో అసైన్‌మెంట్ భూములు 14,297 ఎకరాలు, చుక్కలు భూములు 339 ఎకరాలు, అన్ని రకాల సర్వీసు ఇనాం భూములు 386 ఎకరాలు ఉన్నాయి. ఆయా రైతులకు భూ హక్కులు కల్పించడంతో ఎంతో సంతోషపడ్డారు. తమ భూములకు జీవం వచ్చిందని ఆనంద పడ్డారు.

నిబంధనలు అనుసరించి భూ హక్కు..

కూటమి ప్రభుత్వ ఆదేశాల మేరకు 22ఏ అసైన్‌మెంట్ భూముల ఫ్రీ హోల్డ్‌పై దాదాపు ఐదు నెలలుగా ఆయా తహసీల్దార్ల ఆధ్వర్యంలో రెవెన్యూ బృందాలు బూతద్దాలు పెట్టి వెతికాయి. అయితే ఎక్కడా నిబంధనలకు విరుద్ధంగా చేసినట్లు లేదు. దాదాపు 15 వేల ఎకరాల భూములపై ఉన్న ఆంక్షలను సీసీఎల్ఏ మార్గదర్శకాలను అనుసరించి ఫ్రీహోల్డ్ చేసినట్లు తేలింది. ప్రతి మండలంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో తహసీల్దార్లు విచారణ చేయించారు. మండలాల వారీగా సర్వే పూర్తి చేశారు. ఆన్‌లైన్‌లో ఎవరి పేరు ఉంది.. ఫ్రీహోల్డ్ రైతు ఎవరు.. రిజిస్ట్రేషన్ ఎవరి పేరున అయ్యింది.. తదితర వివరాలను సవివరంగా నమోదు చేశారు. ఫ్రీహోల్డ్ భూములలో ఎన్ని రిజిస్ట్రేషన్ అయ్యాయి, మార్ట్ గేజ్, అమ్మకాలు ఎన్ని రిజిస్ట్రేషన్ అయ్యాయి.. తదితర వివరాలన్నీ సేకరించారు. అనంతరం రెండో దశలో కోనేరు రంగారావు కమిటీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆధ్వర్యంలో క్షుణ్ణంగా పరిశీలించారు. చివరకు అసైన్‌మెంట్ భూముల ఫ్రీహోల్డ్ అంతా సక్రమమేనని తెలింది. దీంతో గత ప్రభుత్వంపై చేసిన ఆరోపణలు అన్నీ గాలిమాటలేనని తేలిపోయాయి.

కూటమి హోల్డ్ చేసి.. రెండో దశ నిలిపి..

గత ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి వెంటనే అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ భూములపై హక్కులు పొందిన రైతుల ఆశలు నీరుగారేలా చేసింది. అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన ఫ్రీహోల్డ్ భూములను హోల్డ్‌లో పెట్టింది. గత ప్రభుత్వం మొదటి దశలో 2003 ఆగస్టు నుంచి 2023 ఆగస్టు వరకు అనుభవంలో ఉన్న రైతులకు హక్కులు కల్పించింది. ఇక నుంచి హక్కులు పొందిన వారు ఆపద సమయాల్లో పట్టా భూముల మాదిరిగా హక్కులు పొంది తనాఖా పెట్టుకోవడం, అమ్ముకోవడానికి అవకాశం కల్పించింది. తరువాత 2024 ఆగస్టులో రెండో దశ, 2025 ఆగస్టులో మూడో దశ...ఇలా ప్రతి సంవత్సరం ఆగస్టులో 20 ఏళ్ల అనుభవం దారులకు హక్కులు కల్పించాలని చట్టం చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అన్నింటిని నిలిపి పేదలను భయపెట్టింది. గత ఆగస్టులో రెండో దశలో భూములకు హక్కులు కల్పించలేదు. ఎంతో మంది రైతులు నిరాశ చెందారు.

6వ తేదీలోపు సీసీఎల్ఏకు వివరాలు అందజేస్తాం



కర్నూలు జిల్లాలో దాదాపు 15 వేల ఎకరాల అసైన్‌మెంట్, చుక్కల భూములు, అన్ని రకాల సర్వీసు ఇనాం భూములు ఫ్రీహోల్డ్ అయ్యాయి. అయితే ఎక్కడా నిబంధనల అతిక్రమించి ఫ్రీహోల్డ్ చేసినట్లు రుజువు కాలేదు. చుక్కల భూములకు సంబంధించి 19 ఎకరాల వివరాలు లేవు. అయితే అవి కూడా నిబంధనల ప్రకారమే ఎవరైతే అనుభవంలో ఉన్నారో వారికే చేశారు. అయితే కొన్ని డాక్యుమెంట్లను పొందుపరచలేదు. కాగా, జిల్లాలో చేసిన అసైన్‌మెంట్ ఫ్రీహోల్డ్ వివరాలను సీసీఎల్ఏకు పంపేందుకు చర్యలు చేపట్టాం. ఈనెల 6వ తేదీలోపు ఫ్రీహోల్డ్‌కు సంబంధించిన అన్ని రికార్డులను స్కాన్ చేసి పంపేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– సి.వెంకట నారాయణమ్మ, డీఆర్వో, కర్నూలు

హెచ్‌ఐవీ బాధితులు జీవితకాలాన్ని పెంచుకోవాలి

- జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి తదితరులు

కర్నూలు(హాస్పిటల్): హెచ్‌ఐవీ బారిన పడిన వారు అధైర్యపడకుండా ఏఆర్‌టీ మందులు సక్రమంగా వాడి జీవితకాలాన్ని పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ నుంచి రాజవిహార్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలావెంకటశేషాద్రి ప్రారంభించారు. 'టేక్ ది రైట్స్ పాత్' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని 'హక్కుల మార్గాన్ని అనుసరించండి–నా ఆరోగ్యం.. నా హక్కు' అనే నినాదంతో నిర్వహించుకోవడం జరుగుతోందన్నారు. హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఏఆర్‌టీ కేంద్రాలు, లింక్ ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందజేయడంతో పాటు అవసరమైన సీడీ4, వైరల్‌లోడ్ పరీక్షలు కూడా ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ హెచ్‌ఐవీ బాధితులు సమాజంలోని ఇతర వ్యక్తుల మాదిరిగా సమాన హక్కులు ఉన్నాయన్నారు. హెచ్‌ఐవీ వ్యాధిని దూరం చేయాలని, హెచ్‌ఐవీతో జీవిస్తున్న వారిని ఆదరించాలని తెలిపారు. సమాజంలో రోగిని ద్వేషించకూడదని, రోగాన్ని మాత్రమే ద్వేషించాలని ఆయన సూచించారు.

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ మాట్లాడుతూ తల్లి నుంచి బిడ్డకు సంక్రమణ, వైరల్ లోడ్ పరీక్షల సేవలకు గుర్తింపుగా మన జిల్లాకు రాష్ట్రస్థాయిలో ఉత్తమ సేవల అవార్డులు లభించాయని తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా నిర్వహించే అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ వరకు కొనసాగుతాయని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఎస్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ ఉమా, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగప్రసాద్‌బాబు, జిల్లా మలేరియ అధికారి నూకరాజు, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రఘురామ్, ఎన్‌సీసీ థర్డ్ ఆఫీసర్ గీతాంజలి, డీఎస్‌డీవో భూపతి, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం క్లస్టర్ ప్రోగ్రామ్ అధికారి వెంకటరత్నం, డీపీవో విజయరాజు, డెమో శ్రీనివాసులు, పలు కాలేజీ విద్యార్థులు, ఎన్‌ఎస్ఎస్, ఎన్‌సీసీ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: ఇలకైలాసమైన శ్రీశైల మహాక్షేత్రం కార్తీక వెలుగులతో కళకళలాడింది. కార్తీక మాసం చివరి రోజైన ఆదివారం ఉభయ రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి మల్లన్న దర్శనానికి బారులుతీరారు. దీంతో ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలు నిండిపోయాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవస్థాన ఈఓ ఎస్.ఎస్.చంద్రశేఖర ఆజాద్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాఢవీధిలో పలువురు భక్తులు కార్తీక దీపాలను వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు.



కార్తీక దీపాలను వెలిగిస్తున్న భక్తులు



మల్లన్న దర్శనానికి ఆలయ క్యూలో వేచిఉన్న భక్తులు

ప్రజా వ్యతిరేక పాలనపై పోరుబాట

- ప్రజలపై బాబు సర్కారు రూ. 15,485 కోట్ల విద్యుత్ భారం
- ఆరునెలల్లో రూ.75 వేల కోట్ల అప్పులు
- విజన్ లేదు.. సంపద సృష్టి లేదు
- ప్రజలను నమ్మించి మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): ' అధికారంలోకి వస్తే భారాలు పెంచను. అన్ని ధరలు తగ్గిస్తా. విజన్ ఉంది. సంపద సృష్టిస్తా' అని ఎన్నికల ముందు ప్రగల్భాలు పలికిన ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరునెలల్లోనే విద్యుత్‌చార్జీలు పెంపు ద్వారా ప్రజలపై రూ.15,485 కోట్ల భారం వేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. బాబు ప్రజా వ్యతిరేక పాలనపై పోరుబాట పట్టనున్నట్లు చెప్పారు. ఆదివారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ హాలులో పార్టీ నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలల్లో రూ. 75 వేల కోట్లు అప్పు చేసిన చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే రెండు సార్లు ట్రూ అప్ చార్జీలు పేరుతో బాబు వినియోగదారుల నడ్డి విరిచారన్నారు. అమ్మకు వందనం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, యువతకు నిరుద్యోగ భృతి, రైతులకు ఆర్థిక సహాయం, మహిళలకు రూ.1500, ఉచితంగా మూడు సిలిండర్ల వంటి సంక్షేమ పథకాలు అమలు చేయకుండానే వేల కోట్ల అప్పు ఎందుకు చేశారో ప్రజలకు చెప్పాలన్నారు. వచ్చే నాలుగున్నర ఏళ్లలో చంద్రబాబు హయాంలో రాష్ట్రం అప్పుల కుప్పగా మారడం ఖాయమన్నారు. సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నిలువునా ప్రభుత్వం మోసం చేసిందన్నారు. అబద్ధాలు ఆడటంలో, ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు బ్రాండ్ అంబాసిడర్ అని విమర్శించారు. విద్యుత్ చార్జీల పెంపు ద్వారా ప్రతి యూనిట్‌కు 0.92 అదనపు భారం ప్రజలపై పడుతుందన్నారు. దీనికి ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్‌సీ) ఆమోదం తెలిపిందన్నారు. దీపావళి పండుగ నుంచే రాష్ట్ర ప్రజలపై సర్కారు రూ. 672 కోట్లు విద్యుత్ భారం మోపగా తాజాగా పెంచిన కరెంట్ చార్జీలతో జనవరి నుంచి ప్రతి యూనిట్‌కు రూ.2.18 పైసలు అదనంగా వినియోగదారులు చెల్లించాల్సి వస్తుందన్నారు.

అవగాహన లేకుండా షర్మిల మాట్లాడటం తగదు

ఎలాంటి అవగాహన లేకుండా వైఎస్ జగన్ పాలనపై కాంగ్రెస్ పార్టీ నాయకురాలు షర్మిల విమర్శలు చేయడం తగదని ఎస్వీమోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబుకు వకాల్తా పుచ్చుకొని ఆమె మాట్లాడుతుందని మండిపడ్డారు. చంద్రబాబు, జగనన్న హయాంలో విద్యుత్ ఒప్పందాలు, చార్జీల వడ్డన పరిశీలిస్తే అర్థమవుతుందన్నారు. వైస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రజా సంక్షేమాన్ని నీరుగార్చిన చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంచితే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ప్రజలు ఇప్పటికే బాబు పాలనపై విసుగు చెందారన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు షరీఫ్, కార్పొరేటర్లు యూనుసుబాషా, షేక్ అహమ్మద్ పాల్గొన్నారు.

సౌర విద్యుత్ ఒప్పందాల్లో....

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సంస్థ అని ఎస్వీమోహన్ రెడ్డి అన్నారు. చవకగా సౌర విద్యుత్ అందించేందుకు సెకీ ముందుకు రావడంతో ఆనాడు వైఎస్ జగన్ నిబంధనల ప్రకారం ఒప్పందాలు చేసుకున్నారన్నారు. అయితే, ఎల్లో మీడియా దీనిపై అనవసరంగా రాద్ధాంతం చేయడమే కాగ దుష్ప్రచారం చేస్తోందన్నారు. నిరూపించాలని ఎల్లో మీడియా యాజమాన్యాలపై తమ అధినేత హైకోర్టులో పరువు నష్టం దావా వేశారన్నారు. తిరుపతి లడ్డు విషయంలోనూ టీడీపీ నాయకులు, ఎల్లోమీడియా అధిపతులు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. ఎన్నికల హామీలు అమలు చేయలేక కూటమి సర్కారు తప్పుడు ప్రచారంతో ప్రజల దృష్టిని మళ్లీస్తుందన్నారు. సౌర విద్యుత్ ఒప్పందాల్లో గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు నాయుడు 2400 మెగావాట్ల కోసం చేసుకున్న ఒప్పందం యూనిట్‌కు రూ.5.90 పైసలు అన్నారు. అదే, వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.2.49 పైసలు మాత్రమేనని చెప్పారు. విండ్, సోలార్ ఎనర్జీ ఒప్పందాల వల్ల చంద్రబాబు హయాంలో 87,500 కోట్ల సంపద ఆవిరైందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాల్లో రూ.1.10 లక్షల కోట్లు ఆదా అయ్యిందన్నారు. డిస్కంలను అప్పుల్లోకి నెట్టిన ఘనత చంద్రబాబుది కాదా అని ప్రశ్నించారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సలాంఖాన్ భవనంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి అధ్యక్షతన ఆ సంఘం జిల్లా విభాగం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఎన్డీఏ కూటమి మేనిఫెస్టోలో పొందుపరిచిన హామీలను సీఎం చంద్రబాబు అమలు చేయాలన్నారు. జీఓ 117 రద్దు చేసి, మధ్యంతర భృతి, ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను విడుదల చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ బకాయిలు రూ.21 వేల కోట్ల రూపాయలు చెల్లింపుపై కార్యాచరణ ప్రకటించాలన్నారు. పాఠశాలల్లో రోజు రోజుకు పెరిగిపోతున్న బోధనేతర పనుల భారాన్ని తగ్గిస్తామని చెప్పి విస్మరించారన్నారు. కాంట్రాక్ట్ పద్ధతిపై పని చేస్తున్న 98, 2008 డీఎస్సీ అభ్యర్థులను రెగ్యులర్ చేసి, 62 ఏళ్లకు పదవీవిరమణ వయస్సును పెంచాలన్నారు. మున్సిపల్ స్కూల్ టీచర్లకు పదోన్నతుల సమస్య పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి టి.కె జనార్దన్, కౌన్సిల్ పరిశీలకులుగా రాష్ట్ర అదనపు కార్యదర్శి .జి.సూర్యుడు, అనంతపురం అధ్యక్షులు ఎస్.రమణారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యవర్గ సభ్యులు సి.నాగరాజు, బి.వెంకటేశ్వర్లు, బి.నాగరాజు, రమేష్,షఫీ, బసవరాజు, వీరచంద్ర యాదవ్, ప్రసన్న రాజు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తులపై తేనెటీగల దాడి



చికిత్స పొందుతున్న బాధితుడు

బేతంచెర్ల: పట్టణంలోని గాడుబావి వీరాంజనేయ స్వామి ఆలయ దర్శనానికి వెళ్లిన భక్తులపై తేనెటీగలు దాడి చేశాయి. కార్తీక అమావాస్య సందర్భంగా పట్టణంలోని గాడు బావి వీరాంజనేయ స్వామి దర్శనార్థం భక్తులు పెద్ద సంఖ్యలో వెళ్లారు. ఆ సమయంలో ఓ పక్షి అక్కడి చెట్టుపైనున్న తేనెతుట్టెకు తగలడంతో ఈగలు లేచి సుమారు 20 మంది భక్తులపై దాడి చేశాయి. ఇందులో వెంకటలక్ష్మమ్మ, మహేష్‌గౌడును ప్రథమ చికిత్స అనంతరం 108 వాహనంలో కర్నూలుకు తరలించారు. మిగతా వారందరూ శేషారెడ్డి సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



ఘటనా స్థలంలో క్షతగాత్రులు

పాణ్యం: మండల పరిధిలోని తమ్మరాజుపల్లె గ్రామ సమీపంలో అడ్డువాగు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలైనట్లు హైవే పోలీసులు తెలిపారు. వివరాలు.. నంద్యాల పట్టణంలోని బస్టాండ్ సమీపంలో నివాసంఉంటున్న నాగార్జున, వెంకటలక్ష్మమ్మ, రత్నమ్మ, చంద్రశేఖర్ ఆదివారం అమావాస్య కావడంతో పుణ్యక్షేత్రాలు సందర్శించేందుకు ఆటోలో బయలుదేరారు. తమ్మరాజుపల్లె అడ్డువాగు వద్ద బ్రిడ్జి ఇరుకుగా ఉండడం, అకస్మాత్తుగా మరో వాహనం క్రాస్ చేయడంతో ఆటో బ్రిడ్జి సైడ్‌వాల్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న నలుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నంద్యాల ఆస్పత్రికి తరలించారు. హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్ సమస్య పరిష్కరించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

మంత్రాలయం: మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామ శివారు పంట పొలాల్లో గుర్తు తెలియని మహిళ మృతదేహం అనుమానాస్పద స్థితిలో పడి ఉంది. స్థానికులు అందించిన సమాచారం మేరకు సీఐ రామాంజులు, మాధవరం ఎస్‌ఐ విజయ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌తో విచారణ జరిపేందుకు ప్రయత్నించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండడంతో అందుకు అవకాశం లేకుండా పోయింది. మృతి చెందిన మహిళ వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలంలోనే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అంత్యక్రియలు చేపట్టారు. కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

ప్రియుడి కుటుంబంపై కేసు

ఆదోని అర్బన్: పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన ప్రియుడితో పాటు అతని కుటుంబ సభ్యులపై వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. కర్ణాటక రాష్ట్రం మైసూరుకు చెందిన చందన మంజునాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. ఆదోని పట్టణానికి చెందిన ఆమె ప్రియుడు గురుఈశ్వర్‌ప్రసాద్, తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు నాగవేణి, నాగరాజు, అరుణ, శివ, శ్రీనివాసులపై జీరో ఎఫ్‌ఐఆర్ కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఇరువురి కుటుంబ సభ్యులు మాట్లాడుకుని, తర్వాత పెళ్లి చేసుకోవడం కుదరదని మోసగించడంతో మైసూరుకు చెందిన చందన మంజునాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

బాల్య వివాహాలు బాలికల భవితకు శాపంగా మారుతున్నాయి. చిన్నారి పెళ్లి కూతురికి పుస్తెల దండ తప్పడం లేదు. బడికెళ్లాల్సిన వయసులో పెళ్లి పీటలెక్కుతున్నారు. పుస్తకాలు పట్టాల్సిన బాలికలు పుస్తెల దండతో అత్తారింటికి వెళుతున్నారు. పట్టుమని 15 ఏళ్లు నిండకుండానే భార్యగా, తల్లిగా బాధ్యతలు మోస్తున్నారు. పేదరికం ఒక వైపు, ఆడపిల్ల భారం తీరుతుందని కన్నవాళ్లే సంసారం అనే సాగరంలోకి బాలికలను నెడుతున్నారు. 18 ఏళ్లు నిండకుండా వివాహాలు చేస్తే అనారోగ్యం పాలవుతారని వైద్యులు హెచ్చరిస్తున్నా పెడచెవిన పెడుతున్నారు.

పుత్తడి బొమ్మకు పుస్తెల దండన



- బడికి వెళ్లాల్సిన వయసులో కుటుంబ బాధ్యత
- వివాహానికి యువతికి 18, యువకుడికి 21 ఏళ్లు నిండాల్సిందే
- బాల్య వివాహాల నిర్మూలన, బాలికల సంరక్షణ కోసం టోల్‌ఫ్రీ నంబర్ 1098 ఏర్పాటు

ఆలూరు రూరల్: 'బాల్య వివాహం నేరం. దీని వల్ల చాలా నష్టాలున్నాయి. బాలికలు మానసికంగా, శారీరకంగా సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముందు పిల్లల్ని బాగా చదివించి ప్రయోజకుల్ని చేయండి' అంటూ అధికారులు అవగాహన కల్పిస్తున్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద కుటుంబాల్లోనే బాల్య వివాహాలు జరుగుతున్నాయి. బాలికల తల్లిదండ్రులకు అక్షరజ్ఞానం, సమాజం పట్ల అవగాహన లేకపోవడం, కుమార్తెకు పెళ్లి చేస్తే భారం తగ్గుతుందనే ఆలోచన, పిల్లలు ప్రేమవైపు ఆకర్షితులైతే కుటుంబం పరువు పోతుందనే భయం, మేనరికాలు, వరుడికి ఉద్యోగం ఉందనే కారణంతో వారి బంగారు భవిష్యత్తును మాంగల్య బంధీ చేస్తున్నారు. పెళ్లంటే ఏమిటో తెలియని వయసులో బాలికలను అత్తారింటికి సాగనంపుతున్నారు.

అడ్డుకునేందుకు అవకాశం

గ్రామస్థాయిలో వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, సీడీపీఓ, మండలస్థాయిలో తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీఓలకు బాల్యవివాహాలను అడ్డుకునే అధికారం ఉంది. ఐసీడీఎస్ తప్పా ఇతర శాఖల అధికారులు దీనిపై దృష్టి సారించడం లేదనే విమర్శలున్నాయి. బాల్య వివాహాలపై ఎవరైనా 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయొచ్చు. సమగ్ర బాలల పరిరక్షణ పథకం కింద ఐసీడీఎస్ ప్రాజెక్టు స్థాయిలో అంగన్‌వాడీ కార్యకర్తలు మండల సమాఖ్య, సంరక్షణ అధికారుల సమన్వయంతో బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి గ్రామ/వార్డు సచివాలయ పరిధిలో ఉన్న క్షేత్రస్థాయి సిబ్బందికి అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నారు. ఆలూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గత ఐదేళ్లలో 19 బాల్య వివాహాలు అడ్డుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అధికారుల దృష్టికి రాకుండా జరిగిపోతున్న పెళ్లిళ్లు అనేకం ఉంటున్నాయి.

బ్యాల వివాహం నేరం

బాల్య వివాహం చట్టరీత్యా నేరం. పెళ్లి చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకు జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా ఉంటుంది. బాల్య వివాహాల నిర్మూలన, బాలల సంరక్షణ కోసం 1098 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులో ఉంది. సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు ఆ వివాహాన్ని అడ్డుకుని తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయబోమని ఒప్పంద పత్రం రాయించుకుంటారు.

వివాహ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

బాల్యవివాహాలను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక చేపట్టారు. జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్, ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో సీడీపీఓలు వివాహ రిజిస్ట్రేషన్ చట్టం- 2002 అమలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామ/వార్డు స్థాయిలో మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా వివాహ రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా చేయించుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. సంతకం చేసిన దరఖాస్తు ఫారం, నివాస ధ్రువీకరణ పత్రం, వయసు, ఆధార్ కార్డు వధువు, వరుడిది, రెండు ఫొటోలు వివాహ పత్రికతో సంబంధిత రిజిస్ట్రేషన్ ఆఫీసులో దరఖాస్తు చేసుకోవాలి. తప్పుడు పత్రాలు సమర్పిస్తే జైలు శిక్షతో పాటు జరిమానా విధించాలనే నిబంధనలు ఉన్నాయి.

నియోజకవర్గంలో గత ఐదేళ్లలో అడ్డుకున్న బాల్య వివాహాలు

ఏడాది	అడ్డుకున్న బాల్య వివాహాలు
2019	4
2020	5
2021	2
2022	2
2023	3
2024	3

సమగ్ర శిశు అభివృద్ధి పథకం అధికారులు అడ్డుకున్న వివాహాల్లో కొన్ని..

- ఈ ఏడాది ఆగస్టు 16న ఆలూరులో బాల్య వివాహం జరుగుతోందని సమాచారం అందడంతో ఐసీడీఎస్ అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. బాలికకు 15 ఏళ్లు ఉండడంతో 18 ఏళ్లు నిండిన తర్వాతే వివాహం చేయాలని ఆమె తల్లి నుంచి రాతపూర్వకంగా రాయించుకున్నారు. వివాహం జరిపితే శిక్షార్హులవుతారని హెచ్చరించారు.
- ఆలూరు మండలంలోని హత్తిబెళగల్‌లో 2021 జూన్ 22న బాల్య వివాహాన్ని ఆపేశారు. ఆధార్ కార్డులో బాలిక వయసు 16 ఏళ్లు ఉండడంతో 18 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహం చేయాలని రాతపూర్వకంగా హామీ తీసుకున్నారు. అతిక్రమిస్తే జైలుకు పంపుతామని హెచ్చరించారు.
- 2022 ఫిబ్రవరి 8న హొళగుంద మండలం పెద్దగోనేహాల్‌లో బాల్యవివాహాన్ని ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. పేదరికంతో పాటు అమ్మాయిని చదివించలేక మంచి సంబంధం రావడంతో పెళ్లి చేస్తున్నట్లు తల్లిదండ్రులు వాపోయారు. బాలికను బాగా చదివించాలని, ఇప్పుడే వివాహం చేయాలని చూస్తే శిక్ష తప్పదని హెచ్చరించారు.

టీనేజ్ ప్రెగ్నెన్సీలతో ప్రాణాలకు ముప్పు



చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల బాలికలు ఎనీమియా బారిన పడే ప్రమాదం ఉంది. ప్రసవం సమయంలో అధిక రక్త స్రావం, అధిక రక్తపోటుతో మరణాలు సంభవిస్తాయి. బిడ్డను మోసే సామర్థ్యం బాలికలకు తక్కువగా ఉంటుంది. దీంతో బిడ్డతో పాటు తల్లికి కూడా ప్రమాదమే. తగిన వయసు లేకుంటే మానసిక, శారీరక పరిపక్వత ఉండదు.– గీతావాణి, గైనకాలజిస్ట్, ఆలూరు

సమాచారం ఇవ్వండి



ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్టు తెలిస్తే మా దృష్టికి తీసుకురావాలి. పోలీసు, రెవెన్యూ, చైల్డ్‌లైన్ 1098 ద్వారా వాటిని అడ్డుకుంటాం. బాల్య వివాహాల కారణంగా జరిగే నష్టాలను వివరిస్తున్నాం. బాలికల ఆరోగ్యం, వారి భవిష్యత్తుపై తెలియజేస్తున్నాం. అన్ని కోణాల్లో నిరోధించడానికి శ్రమిస్తున్నాం. క్షేత్రస్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలు ఇచ్చాం.

– మద్దమ్మ, సీడీపీఓ, ఆలూరు

అందరూ బాధ్యులే



బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం. బాల్య వివాహం జరిపించిన తల్లిదండ్రులు, సంరక్షకురాలు, అనుమతించిన పెద్దలు, పెళ్లికి సహకరించిన వారు కూడా నేరస్తులే అవుతారు. మైనర్ బాలికను పెళ్లి చేసుకుని సంసారం చేస్తే పోక్సో కేసు నమోదవుతుంది.

– వెంకట చలపతి, సీఐ, ఆలూరు

బాల్య వివాహాలతో ముప్పు

- బాలికల్లో శారీరక, మానసిక ఎదుగుదల ఉండదు. వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం ఉంటుంది.
- చిన్న వయసులో గర్భం దాల్చే బాలికల్లో గర్భస్రావం ముప్పు ఎక్కువ
- శిశు మరణాలతో పాటు తల్లుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతుంది.
- పుట్టిన బిడ్డ తక్కువ బరువుతో ఉంటారు. భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు వస్తాయి.
- 60 శాతం బాలికల్లో రక్తహీనత ఉంటుంది. ఈ క్రమంలో గర్భం దాల్చడం మంచిది కాదు.

జాతీయ స్థాయిలో సత్తా చాటాలి



రాష్ట్రస్థాయి విజేతలతో నిర్వాహకులు

నంద్యాల(న్యూటౌన్): టేబుల్ టెన్నిస్ పోటీల్లో జాతీయస్థాయిలో ఏపీ జట్టు విజయపతాకం ఎగురవేయాలని డీఈఓ జనార్దన్‌రెడ్డి సూచించారు. స్కూల్ గేమ్ ఫెడరేషన్ అండర్-14 టేబుల్ టెన్నిస్ క్రీడల ముగింపోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సభలో డీఈఓ మాట్లాడారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ అధికారి భానుమూర్తి రాజు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనాథ్ ఆధ్వర్యంలో టేబుల్ టెన్నిస్ క్రీడలు విజయవంతంగా ముగిశాయి. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు గుజరాత్ రాష్ట్రంలోని బావ్‌నగర్‌లో 2025 జనవరి 2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించే పోటీల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా తిరిగి రావాలని డీఈఓ సూచించారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు నంద్యాలలో విజయవంతం కావడం అభినందనీయమన్నారు. ఇందుకు సహకరించిన వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లను ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనాథ్, డీఈఓలు అభినందించారు. కార్యక్రమంలో ఏపీ రెడ్డి, దండె నాగరాజు, విశ్వనాథ్, ఫిజికల్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

తరగతి గదిలో విద్యార్థికి పాముకాటు

గోనెగండ్ల: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న మాలిక్ బాషా అనే విద్యార్థికి శనివారం తరగతి గదిలో పాము కాటు వేసింది. ఈ ఘటన ఒకరోజు ఆలస్యంగా ఆదివారం వెలుగులోకి వచ్చింది. పాఠశాలలో జరిగిన ఘటనను బయటకు రానివ్వకుండా సిబ్బంది నానాతంటాలు పడినట్లు తెలుస్తోంది. వివరాలు.. మండలంలోని పెద్దనేలటూర్ గ్రామానికి చెందిన దస్తగిరికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. చిన్న కుమారుడు గోనెగండ్ల మోడల్ స్కూల్‌లో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. రోజూ గ్రామం నుంచి స్కూల్‌కు వెళ్లి వస్తుంటాడు. శనివారం ఉదయం పాఠశాలలో ప్రార్థన ముగించుకొని తరగతి గదిలోకి వెళ్లి టేబుల్‌పై కూర్చొగానే బెంచీ కింద ఉన్న పాము కాలికి కాటు వేసింది. బెదిరిపోయిన మాలిక్‌బాషా గట్టిగా కేకలు వేశాడు. తరగతిలోని విద్యార్థులు పాఠశాల సిబ్బందికి తెలపగా హుటాహుటిన గోనెగండ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఈఓ రామాంజనేయులు ఆస్పత్రికి వెళ్లి విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఘటనను డీఈఓకు తెలియజేశారు. ప్రస్తుతం బాధిత విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

పాఠశాల ప్రాంగణంలో అపరిశుభ్రం

గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్ ప్రాంగణం అపరిశుభ్రంగా ఉండటం, పిచ్చిమొక్కలు పెరగడం వల్ల విష పురుగులు గదుల్లోకి వస్తున్నాయి. వారం రోజుల క్రితం పాఠశాలలోకి పాము చొరబడింది. దీంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. పాఠశాలలోని సమస్యలు, సిబ్బంది నిర్లక్ష్యంపై నాలుగు రోజుల క్రితం పీఎంసీ గౌస్, కమిటీ సభ్యులు ఎంఈఓకు వినతిపత్రం అందించారు. అయినా అధికారులు, పాఠశాల సిబ్బంది స్పందించకపోవడంతో శనివారం విద్యార్థి పాము కాటుకు గురయ్యాడు. గతంలో మోడల్ స్కూల్ హాస్టల్‌లో 10 మంది విద్యార్థినులను ఎలుకలు కరవడంతో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందిన విషయం తెలిసిందే. పాఠశాలలో సమస్యలు పరిష్కరించరు గానీ, విద్యార్థులకు ప్రమాదం జరిగితే ఎవరికీ తెలియకుండా గోప్యంగా ఉంచుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు సిబ్బందిపై మండిపడుతున్నారు. అధికారులు స్పందించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకొని పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

హైకోర్టు రిజిస్ట్రార్‌ను కలిసిన కలెక్టర్



కర్నూలు(సెంట్రల్): జిల్లాకు వచ్చిన హైకోర్టు రిజిస్ట్రార్ (రిక్రూట్‌మెంట్) మహ్మద్ ఫజులుల్లాను కలెక్టర్ పి.రంజిత్‌బాషా మర్యాదపూర్వకంగా కలిశారు. కర్నూలులోని రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఉండగా వెళ్లి కలిశారు. కలెక్టర్ వెంట జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి



హాస్టల్ మెస్‌లో భోజనం చేస్తున్న ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: రాయలసీమ యూనివర్సిటీ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని వర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. ఆదివారం ఆయన వర్సిటీలోని హాస్టళ్లను తనిఖీ చేశారు. అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు పరిశుభ్ర వాతావరణంలో పౌష్టికాహారం అందించాలని సిబ్బందికి సూచించారు. వంటశాల, డైనింగ్ హాళ్లు, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు. ఆహార పదార్థాలను వృథా చేయకుండా ప్రతి ఒక్కరు బాధ్యతతో మెలగాలన్నారు.

వలస కూలీకి కడుపుకోత

- ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో ఐదేళ్ల చిన్నారి మృతి
- మృతురాలు పోతుగల్లు గ్రామవాసి



మృతి చెందిన మమత (ఫైల్)

కృష్ణగిరి: పొట్ట చేతపట్టుకుని బతుకుదెరువు కోసం వలస వెళ్లిన ఓ తల్లికి గర్భశోకం మిగిలింది. ట్రాక్టర్ బోల్తా పడిన ప్రమాదంలో కుమార్తెను కోల్పోయి తీవ్ర గాయాలపాలైంది. వివరాల్లోకి వెళితే.. కృష్ణగిరి మండలం, పోతుగల్లు గ్రామానికి చెందిన బోయ దుపాటి ఎల్లనాయుడు, సుజాత దంపతులకు ఇద్దరు పిల్లలు సంతానం. ఎల్లనాయుడు నాలుగేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో ఇద్దరు పిల్లల బాధ్యత సుజాతపై పడింది. గ్రామంలో పనులకు వెళుతూ, పనులు లేని సమయంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో నెల రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లా, కొత్తూరు మండలం, రెడ్డిపాలెం గ్రామానికి ఇద్దరు పిల్లలతో వెళ్లింది. నెల రోజులు పనిచేసి 29వ తేదీన పింఛన్ కోసం పోతుగల్లు గ్రామానికి వచ్చింది. శనివారం పింఛన్ తీసుకుని కర్నూలుకు వెళ్లి రైలు ఎక్కి శంషాబాద్ సమీపంలోని తిమ్మాపూర్ స్టేషన్‌లో దిగింది. రాత్రి కావడంతో రెడ్డిపాలెం వెళ్లేందుకు ఆటోలు లేక ఇతర గ్రామాల కూలీలు వెళుతున్న ట్రాక్టర్ ఎక్కింది. కొద్దిదూరం వెళ్లాక ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడడంతో చిన్నారి మమత (5) మృతి చెందింది. సుజాతకు కాలు విరగగా కుమారుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. పింఛన్ తీసుకొని వెళ్లిన ఒక్కరోజులోనే కుమార్తె శవంతో తల్లి స్వగ్రామానికి తిరిగిరావడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇదే ప్రమాదంలో గోనెగండ్ల మండలం, తిప్పనూర్‌కు సోమమ్మ (55) మృత్యువాత పడింది.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

- నిందితులు గుంటూరు జిల్లా వాసులుగా గుర్తింపు
- రూ.71 వేల నగదు, బైక్ స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుస్తున్న టౌన్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ డాక్టర్ నాయక్

ఎమ్మిగనూరురూరల్: గత నెల 13వ తేదీ అర్ధరాత్రి రెండు మద్యం దుకాణాల్లో చోరీకి పాల్పడిన ఇద్దరు దుండగులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఆదివారం సాయంత్రం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీనివాసులు మీడియాకు వివరాలు వెల్లడించారు. చోరీ ఘటనపై ఆదిలక్ష్మీ వైన్ షాప్ మేనేజర్ బాషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టాం. నిందితులు స్కూటర్‌ను ఉపయోగించినట్లు సీసీ ఫుటేజీలో నమోదైంది. ఈ ఆధారంతో ఎమ్మిగనూరు నుంచి ప్రకాశం జిల్లా దోర్నాల వరకు (220 కి.మీ) ప్రభుత్వ, ప్రైవేట్ సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి దుండగులు వెళ్లిన దారిని గుర్తించాం. ఆదివారం సాయంత్రం కర్నూలు వెళ్లే దారి గోనెగండ్ల రోడ్డులో వాహనాల తనిఖీ చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నాం. స్కూటర్‌లో ఉన్న రూ.71 వేల నగదు, దుండగులు ఉపయోగించిన స్క్రూడ్రైవర్‌లు, స్కూటర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులు గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన మణికంఠరెడ్డి, వినుకొండకు చెందిన పోగుల బాలవెంకట్‌గా తెలిసిందని చెప్పారు. మణికంఠరెడ్డి 18 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని, బాలవెంకట్‌కు ఇదే మొదటి దొంగతనంగా విచారణలో తెలిసిందన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

కోలుకోలేక వృద్ధురాలి మృతి



మృతి చెందిన సుంకులమ్మ

గోనెగండ్ల: మండల కేంద్రానికి చెందిన సుంకులమ్మ (81) అనే వృద్ధురాలు చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గోనెగండ్ల ఎస్సీ కాలనీకి చెందిన సుంకులమ్మ అనే వృద్ధురాలు రెండు రోజుల క్రితం వంట గదిలో స్నానానికి వేడి నీళ్లు పెట్టుకుంటుండగా ప్రమాదవశాత్తు చీర కొంగు మంటల్లో పడి నిప్పంటుకుంది. చీరతో పాటు ఒళ్లు కాలుతుండగా గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక ఆదివారం వృద్ధురాలు మృతి చెందినట్లు సీఐ తెలిపారు. మృతురాలి కుమారుడు నల్లన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృత్యువాత



వర్కూరులో కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన ఎద్దు

కోడుమూరు రూరల్: మండలంలోని వర్కూరు గ్రామంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి ఎద్దు మృతిచెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చంద్రబాబు యథావిధిగా ఆదివారం ఉదయాన్నే ఎద్దుల బండి కట్టుకొని వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లాడు. ఎద్దులను విప్పి వ్యవసాయ సామగ్రిని పొలంలోకి మోసుకెళ్తుండగా ఒక ఎద్దు పక్కనే ఉన్న గట్టు వద్ద మేత మేసేందుకు వెళ్లింది. అక్కడున్న కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో ఎద్దు అక్కడికక్కడే మృత్యువాత పడింది. వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతు చంద్రబాబు రూ.80 వేలు విలువ చేసే ఎద్దు మృతిచెందడంతో కన్నీరు మున్నీరయ్యాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు ఎలక్ట్రికల్ ఏఈ మధుసూదన్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు.

ముంచిన పులికనుమ



నీట మునిగిన వేరుశనగ పంటను చూపుతున్న బాధిత రైతులు

కోసిగి: మండల కేంద్రానికి సమీపంలో పులికనుమ రిజర్వాయర్ నీటిమట్టం పెరిగి ఓవర్‌ఫ్లో కావడంతో 10 ఎకరాల్లో వేరుశనగ, కంది, సజ్జ పంటలు నీటిపాలయ్యాయి. పులికనుమ రిజర్వాయర్‌ను 800 ఎకరాల విస్తీర్ణంలో 1.2 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించారు. ప్రస్తుతం తుంగభద్ర నదిలో ప్రవాహం కొనసాగుతుండడంతో ప్రాజెక్ట్ అధికారులు రెండు మోటార్లు ఆన్ చేసి రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్ చేపడుతున్నారు. స్లూయిస్ గేట్లు మూసి వేసి రోజువారీగా పంపింగ్ చేస్తుండటంతో రిజర్వాయర్ పూర్తిగా నిండిపోయింది. దీంతో నీరు ఓవర్ ఫ్లో అయ్యి సర్వే నంబర్ 154లో కోసిగికి చెందిన కామలదొడ్డి వీరారెడ్డి, ఈరమ్మ, మల్లిగేని కోసిగయ్య, ఈరన్నకు చెందిన పదెకరాల్లోని వేరుశనగ, కంది, సజ్జ పంటలు నీట మునిగాయి. రూ.2 లక్షలు వెచ్చించి వేరుశనగ సాగుచేశామని 15 రోజుల్లో దిగుబడి చేతికి వచ్చే దశలో ఉండగా రిజర్వాయర్ నీటితో తీవ్ర నష్టం మిగిలిందని మహిళా రైతు ఈరమ్మ కంటతడి పెట్టుకుంది. చేసేది లేక పశువులకు గ్రాసం అయినా మిగులుతుందని పంటను తొలగించాల్సి వచ్చిందన్నారు. బ్యాంకులో రూ.1.50 లక్షలు, బయట మరో రూ.4 లక్షలు అప్పులు చేసి పంటలు సాగు చేశామని, ఈ ఏడాది పంట చేతికందితే అప్పులు తీర్చుదామనుకున్న దశలో ఇలా జరిగిందని వాపోయారు. రిజర్వాయర్‌లోకి నీటి పంపింగ్‌ను నిలిపివేయాలని లేకపోతే మరో 10 ఎకరాల మేర నీట మునిగిపోతుందని ఆరోపించారు. అధికారులు స్పందించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.